క్లుప్తంగా

హైదరాబాద్ వెళ్లి పింఛను పంపిణీ



మండలం సాయిపేటకు చెందిన బోడిపూడి కాంతమ్మ అనారోగ్యం కారణంగా వైద్యం కోసం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉండి చికిత్స పొందుతోంది. ఈ నెలకు సంబంధించిన పింఛన్‌ను స్థానిక వలంటీరు రసూల్ హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేశాడు.

– కొండాపురం

సొసైటీ అధ్యక్షుడిగా 'ఐయితా' కొనసాగింపు



వెంకటకొండయ్య

కొండాపురం: మండలంలోని గరిమెనపెంట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా కోవివారిపల్లికి చెందిన ఐయితా వెంకటకొండయ్యను కొనసాగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తనను నాలుగో సారి ఈ పదవికి నామిటేడ్ చేసిన మేకపాటి కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. 2013లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయడంతో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వెంకటకొండయ్యను నామిటేడ్ చేశారు. తూర్పు యర్రబల్లికు చెందిన పి.కొండయ్య, గొట్టిగుండాలకు చెందిన శీలం రమణారెడ్డి డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

అభివృద్ధి చేస్తే అవినీతి ఆరోపణలా?

- జడదేవి సర్పంచ్ కామేపల్లి పద్మజ

వరికుంటపాడు: మండలంలోని జడదేవి పంచాయతీలో జరిగే అభివృద్ధిని చూసి ఓర్వలేని కొంత మంది వ్యక్తులు అవినీతి ఆరోపణలు చేయడం సిగ్గుచేటని జడదేవి సర్పంచ్ కామేపల్లి పద్మజ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కామేపల్లి వెంకటరత్నం దుయ్యబట్టారు. జడదేవిలో శుక్రవారం తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏకగ్రీవ సర్పంచ్‌గా జడదేవిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల కోసం తన సొంత నిధులు రూ.లక్షల్లో ఖర్చు చేశామన్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు వేస్తూ ఉండే కొంత మంది అడ్డుపడే ప్రయత్నం చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో చెక్‌డ్యామ్‌లు, ఫైబర్ చెక్‌డ్యామ్‌ల పనుల్లో రూ.కోట్లు అవినీతి జరిగిందని గుర్తు చేశారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు సహకరించకుండా అడ్డుకోవాలనే ప్రయత్నాలు గ్రామ ప్రజలు గమనిస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే తాము ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికైనా ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకుని గ్రామాభివృద్ధిలో భాగస్వామం కావాలన్నారు.

హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు

- కావలి టూటౌన్ సీఐ సుధాకర్



కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ సుధాకర్

కావలి: వాహనచోదకులు నిబంధనలు పాటించకుండా, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని కావలి టూటౌన్ సీఐ సుధాకర్ హెచ్చరించారు. మద్యం సేవించి బైక్‌లు నడిపితే జరిమానాలు కూడా ఎక్కువగా ఉంటాయని, అలాగే కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం పలువురు వాహనచోదకులను తనిఖీ చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో టూటౌన్ ఎస్‌ఐలు గోపిచంద్, బాలకృష్ణ, సిబ్బందితో కలిసి సీఐ బైక్‌లపై వెళ్తున్న వారిని ఆపి తనిఖీలు చేశారు. 50 మంది బైక్‌లను ఆపితే ఒక్కరికీ కూడా హెల్మెట్లు ధరించలేదన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సురెన్సులు, పొల్యూషన్ తదితర వాటికి సంబంధించిన పత్రాలు కూడా లేవన్నారు. దీంతో సీఐ సుధాకర్ వారందరితో నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేయించారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



పిన్నుబోయిన సంజన



నాగినేని స్పందన

ఆత్మకూరు: ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీలో రెండో ఫేజ్ ఎంపికల్లో ఆత్మకూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం శుక్రవారం తెలిపారు. ఇటీవల పాఠశాల నుంచి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన పిన్నుబోయిన సంజన, నాగినేని స్పందనకు శ్రీకాకుళం జిల్లాలోని ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



చంద్రబాబునగర్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే రామిరెడ్డికి ఘనంగా స్వాగతం పలుకులున్న మత్స్యకార గ్రామాల కాపులు

ప్రజల వద్దకే పాలన, సంక్షేమం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి
- మత్స్యకార గ్రామాల్లో నీరాజనాలు

అల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజల వద్దకే పరిపాలన, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ సాల్ట్ బంగ్లా, చంద్రబాబునగర్, కుర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకార మహిళలు ఎమ్మెల్యేకు అడుగడుగున మంగళహారతులు పడుతూ, పూలవర్షం కురిపిస్తూ, తీన్‌మార్ బ్యాండ్‌తో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న కారణంగానే వారు తమపై ఎంతో ప్రేమ చూపిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, మేనిఫెస్టో అమలు చేయడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో మొదటి స్థానంలో ఉన్నారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలను పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ పథకాలు అమలు చేయడం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, సర్పంచ్ రంజిత్‌కుమార్, వైస్ ఎంపీపీ కొండూరు వాసు, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సాధక్ రెడ్డి, కొండూరు శ్రీను, నిమ్మల భాస్కర్, చెంతాటి కరుణాకర్, సుధ, ఎ యాదగిరి, ఎ.శీనయ్య, ఎస్.చిరంజీవి, ఎస్.తిరుపతి, షేక్ జంషీర్, వెంకయ్య, కాపులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మరో కార్గో బుకింగ్ కేంద్రం ఏర్పాటు



కావలిలో ఆర్టీసీ రెండో కార్గో కేంద్రం

కావలి: ఆర్టీసీ యాజమాన్యం కావలి పట్టణ ఉత్తర శివార్లలోని జెండాచెట్టు సెంటర్‌లో శుక్రవారం మరో అ. దీకృత కార్గో బుకింగ్ కేంద్రాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి ఉత్తర ప్రాంతంలో ఉండే వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం నూతన అధీకృత బుకింగ్ ఏజెంట్‌ను నియమించమన్నారు. కార్గో సేవలు అందరికీ అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత ఆసక్తి చూపితే గ్రామీణ ప్రాంతాల్లో కూడా కార్గో ఏజెంట్‌గా పనిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. కార్గో సేవలు విస్తృతం చేస్తామని, ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు, ఎరువులు, పాఠశాలలకు పుస్తకాలు యూనిఫాం ఆర్టీసీ కార్గో ద్వారా రవాణా చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. నూతన కార్గో కేంద్రం నిర్వాహకులు మహ్మద్ కరీముల్లా మాట్లాడుతూ తమ కేంద్రం నుంచి టూ పే విధానంలో బుకింగ్ చేసుకోవచ్చని, తద్వారా పార్సెల్ చేరిన తర్వాత రుసుం చెల్లించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ క్లాత్ మార్కెట్ అధ్యక్షుడు చెన్నా వెంకట సత్యం మాట్లాడుతూ నూతన కార్గో కేంద్రం తమ వస్త్ర వ్యాపారులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, స్థానిక వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో డిప్యూటీ డీఈఓ తనిఖీ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఈఓ రఘురామయ్య

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఏపీ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం కావలి డిప్యూటీ డీఈఓ రాఘురామయ్య తనిఖీ చేశారు. ఆయన పాఠశాలలో వసతి గృహాలు, భోజనశాల, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థుల ద్వారా డెమో క్లాస్‌లో చర్చించారు. ఇంటర్వ్యూకు తొమ్మిది మంది దరఖాస్తు చేసుకోగా ఒకరి దరఖాస్తు తిరస్కరించారు. మిగిలిన వారిలో ఏడుగురు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గల్లా మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం



కమ్మవారిపాళెం సొసైటీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెం పీఏసీఎస్ నూతన అధ్యక్షుడిగా తుమ్మల వెంగయ్యచౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కమ్మవారిపాళెం సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడిగా తుమ్మల వెంగయ్యచౌదరి, డైరెక్టర్లుగా దేవరపాటి సురేంద్రరెడ్డి, వంకల వేమారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. నందిపాడు సొసైటీ అధ్యక్షుడిగా మండ్ల శ్రీనివాసులు, డైరెక్టర్లుగా ఉండేల దశరథరామిరెడ్డి, పోలక సుబ్బారెడ్డి సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ సాయిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎల్‌పీ కొండారెడ్డి, సొసైటీ సీఈఓలు లోకనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, జేసీఎస్ మండల కన్వీనరు శ్రీహరినాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం ఖాజారంతుల్లా

ఉదయగిరి: మండలంలోని పొదుపు సంఘాల వివరాలను వీఓఏలు, సీసీలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం ఖాజారంతుల్లా తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వీఏఏలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 869 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే వీఏఓలు 400 గ్రూపులను లోకోస్ యాప్‌లో నమోదు చేశామన్నారు. మిగిలిన గ్రూపులను ఈ నెల చివరి నాటికి నమోదు చేసి పూర్తి చేయాలన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. నెలసరి సమావేశాలు నిర్వహించి రుణాల రికవరీపై చర్చించాలన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతల పరిరక్షణ



మర్రిపాడు పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న ఆత్మకూరు సీఐ వేణు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రజల సహకారంతో శాంతి భద్రత పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆత్మకూరు సీఐ వేణు అన్నారు. సర్కిల్ పరిధిలోని మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ఎస్సై విశ్వనాథ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లను గుర్తించి నేరాలకు పాల్పడకుండా కట్టడి చేస్తామన్నారు. బాధితులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు జేవీవీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకొకసారి నిర్వహించే షుగర్, బీపీ వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు జేవీవీ కార్యవర్గ సభ్యుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని షిరిడీ సాయిరామ్ కళాశాలలో నెల్లూరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సహకారంతో నిర్వహించే ఈ శిబిరం ఉదయం 7 గంటల నుంచి మొదలవుతుందన్నారు. ఈ వైద్యశిబిరాన్ని ఆత్మకూరుతో పాటు సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతి తక్కువ ధరలకే రెండు నెలలకు సరిపడా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

టీటీడీ ఈఓకు వినతి



ఈఓ ధర్మారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మోహన్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని నల్లగొండ్లలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కోనేరు జీర్ణోద్ధరణ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి తిరుమలలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని కలిశారు. తమ వంతు సహాయం చేసేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారన్నారు. ఆయనతో పాటు అంకినపల్లి ఓబులరెడ్డి ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



గృహోపకరణాలు చూపుతున్న ఓబుల్ రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పలువురి ఇళ్లలో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ సరిగా లేకపోవడంతో తరచూ ఇలాంటి నష్టాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటిలోనే ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు తదితర గృహోపకరణాలు లక్ష రూపాయలకుపైగా విలువైన వస్తువులు దగ్ధమయ్యాయని, ఆ సమయంలో మనుషులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.

కావలిలో 30 పోలీస్ యాక్ట్ అమలు

- డీఎస్పీ ఎం వెంకట రమణ

కావలి: కావలి పట్టణంలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని డీఎస్పీ ఎం వెంకటరమణ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, రద్దీ ప్రదేశాల్లో ఎలాంటి బహిరంగ సభలు నిర్వహించరాదన్నారు. సమావేశాలు, ధర్నాలు, ఊరేగింపులు, దిష్టి బొమ్మలు దగ్ధం చేయడం వంటివి నిర్వహించరాదన్నారు. దీనిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు



చామదలలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందిస్తున్న మేకపాటి రాజారెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

- సంక్షేమ పథకాల సృష్టికర్త సీఎం వైఎస్ జగన్
- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు

జలదంకి: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో దేవుడిగా నిలిచారని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చామదల పంచాయతీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి రాజారెడ్డి, వంటేరులకు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతుభరోసా, జగనన్న విద్యాదీవెన, సున్నా వడ్డీ, నేతన్ననేస్తం తదితర పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో క్షుణ్ణంగా వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు లబ్ధిదారులకు అందించారు. రాజారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ కేంద్రాల ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి గ్రామ స్వరాజ్యానికి సరైన భాష్యం చెప్పారన్నారు. పనులు చేసే ప్రభుత్వం, పేద వారికి కష్టాలు తీర్చే ప్రభుత్వం జగన్ ప్రభుత్వమన్నారు. నాలుగు తరాలు గుర్తు పెట్టుకునే విధంగా సీఎం పాలన సాగుతుంటే పద్నాలుగేళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు ఎన్ని రకాల మోసాలు చేశాడో ప్రజలు గ్రహించాలన్నారు. వంటేరు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా సంక్షేమ పథకాలు నిలిపివేయకుండా అమలు చేశారన్నారు. ఏడొందల రకాల సేవలు గ్రామ సచివాలయాల్లో అందుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ అనే సంజీవిని తెచ్చిన నాయకుడు వైఎస్సార్ అని, గత పాలకులు ఆ పథకాన్ని నీరుగార్చారన్నారు. 3,108 రోగాలను ఆరోగ్యశ్రీలోకి తెచ్చిన మనసున్న నాయకుడు జగన్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకి ఓటేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చేవూరి జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, ఎంపీటీసీలు పసుపులేటి అమరావతి, దేవరపల్లి విజయ్‌రెడ్డి, వంటేరు హజరత్‌రెడ్డి, కోటా కోటిరెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, గుర్రం జగ్గయ్య, సర్పంచ్ పి.సీతారావమ్మ, వంటేరు లక్ష్మీనరసారెడ్డి, పుసుపులేటి ప్రసాద్, వంటేరు చినలక్ష్మీనరసారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక జీవనశైలితో క్యాన్సర్ ముప్పు

- నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారిణి టి.లక్ష్మి



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న క్యాన్సర్ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారిణి లక్ష్మి

కావలి: ఆధునిక జీవనశైలి కారణంగా క్యాన్సర్ వ్యాధి సంక్రమించడం అధికమయ్యిందని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారిణి టి.లక్ష్మీ అన్నారు. శుక్రవారం జవహర్ భారతి ప్రాంగణంలోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. జేబీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఐదుగురిలో ఒకరికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్‌ను మనమే కొని తెచ్చుకుంటున్నామని, ఇంటి తిండిని వదలి బయట వండిన ఆహారం తినడం, పొగాకు వాడకం క్యాన్సర్ ముప్పునకు ప్రధాన కారకాలని వివరించారు. వివిధ వైరస్‌ల వల్ల కూడా క్యాన్సర్ వ్యాధి సంక్రమిస్తోందన్నారు. పైకి ఆరోగ్యంగా కనిపించినా, లోపల క్యాన్సర్ దాగి ఉండవచ్చని, సంవత్సరానికి ఒకసారి తప్పక క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత క్యాన్సర్ చికిత్స అందిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రి ప్రతినిధి గంగా కన్యాకుమారి మాట్లాడుతూ ప్రతి శుక్ర శనివారాల్లో అతి తక్కువ ఖర్చుతో క్యాన్సర్, ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జేబీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.శామ్యూల్‌రాజ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి సుబ్రహ్మణ్యంనాయుడు, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, క్యాన్సర్ ఆస్పత్రి ప్రతినిధి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



శ్రీపంచముఖ శక్తిగణపతికి విశేష పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లిలో కొలువైన శ్రీపంచముఖ శక్తిగణపతి స్వామి వారికి సంకటహర చతుర్థి సందర్భంగా శుక్రవారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గజమాలలు, గరికమాలలు, పలు రకాల పండ్లతో విశేష అలంకరణ చేశారు. గ్రామానికి చెందిన రేవూరు సుధమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వరశర్మ పూజలు, అర్చనల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

నేడు విద్యుత్ పనులు

అల్లూరు: మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ షేక్ మస్తాన్ షరీఫ్ తెలిపారు. అల్లూరు 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, విద్యుత్ తీగలు మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.